క్లుప్తంగా

ఉపాధి పనులు తనిఖీ చేసిన కేంద్ర బృందం



కారెంపూడి: మండలంలోని మిరియాల, ఒప్పిచర్ల, కాచవరం గ్రామాలలో జరిగిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను కేంద్ర బృందం శనివారం తనిఖీ నిర్వహించింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేసిన పనులను తనిఖీ చేశారు. అలాగే గృహ నిర్మాణ పథకం కింద లబ్ధిపొందిన వారి వివరాలు తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. వెలుగు పథకం కింద మరింతగా మహిళలు ఎలా లబ్ధిపొందవచ్చనే విషయాన్ని కేంద్ర తనిఖీ బృందం అధికారులు లోహిత్ రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి మహిళలకు వివరించారు. కేంద్ర బృందం అధికారులతో పాటు వెలుగు పీడీ బాలూనాయక్, డ్వామా ఎఫ్‌ఎం హీరాలాల్, డీపీఓ భాస్కరరెడ్డి, కారెంపూడి ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

22న ప్రత్యేక వైద్య శిబిరం



మాచర్ల: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఈ నెల 22న వైద్య శిబిరాన్ని నిర్వహించటం జరుగుతుందని, దీనిని మాచర్ల ప్రాంత వాసులంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.ఉదయభాను తెలిపారు. శనివారం ఆమె కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో వైద్యశిబిరం ద్వారా చిన్నపిల్లల నోటిలో పుట్టుకతో వచ్చిన సమస్యలు, పెదవి చీలిక, అంగిలి చీలిక తో పాటు వివిధ సేవలకు ఈ శిబిరం నిర్వహించటం జరుగుతుందన్నారు. పల్నాడు జిల్లా ఆర్‌బీఎస్‌కే టీం, దంతవైద్య నిపుణులు ఈ శిబిరంలో అందుబాటులో ఉంటారని, ఉదయం 10గంటల నుంచి వైద్య శిబిరం జరుగుతుందన్నారు. వచ్చిన ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు తీసుకొని వైద్య శిబిరానికి హాజరై శిబిరంలో వైద్యం పొందాలన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబ చిరస్మరణీయుడు



మాచర్ల: స్వర్గీయ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబ అనేక సంవత్సరాలు పౌర హక్కులు, బడుగు వర్గాల హక్కుల పరిరక్షణలో ముందుండి జైలు జీవితం గడిపి మృతిచెందడం ఎంతో బాధాకరమని ఎంసీపీఐ జిల్లా లీడర్ అబ్రహం లింకన్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సాయిబాబ చిత్రపటానికి పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయిబాబ అంగవైకల్యంతో ఉండీ ఆదివాసీల పరిరక్షణ కోసం జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. నివాళులర్పించిన వారిలో బహుజన సమాజ్ పార్టీ నేతలు గద్దల సైదులు, ఆలేటి సంపూర్ణ, వేముల శివ, సిద్ధాల సంతోషం, కార్మిక సంఘ నాయకులు డేగల కుమార్, ఎం.ఏసోబు, కొమ్ము నాగరాజు, బత్తుల కోటేశ్వరమ్మ, మాచర్ల లక్ష్మమ్మ, పోలేపల్లి కుమారి, ఆలేటి జానమ్మ, అన్నమ్మలున్నారు.

అన్నదానం



కారెంపూడి: ఇటీవల మృతి చెందిన మానసిక దివ్యాంగుడు సూరె సుబ్రమణ్య గుప్తా జ్ఞాపకార్థం ఆయన సోదరులు మాజీ ఉపసర్పంచ్ సూరె అంకారావు, ఆంజనేయులు తదితరులు శనివారం వీరాంజనేయ స్వామి దేవాలయంలో అన్నదానం చేశారు. వాసవి అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

పిడుగురాళ్లలో భారీవర్షం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాయగా.. మధ్యాహ్నం నుంచి వర్షం భారీ వర్షం కురిసింది. గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి, మిరప, కంది పంట పొలాలు నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రీ సర్వే సమస్యలపై గ్రామసభ

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం గ్రామ సభలు ద్వారా పరిష్కరిస్తుందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు చెప్పారు. మండలంలోని పలు దేవర్లపాడు గ్రామంలో భూ రీసర్వే సమస్యల పై శనివారం గ్రామసభ నిర్వహించారు.

చిన్న వర్షానికే చిత్తడి

- పల్నాటి చెన్నకేశవస్వామి ఆలయంలో దుస్థితి
- శ్లాబు నుంచి కారుతున్న నీరు
- బకెట్లు పెడుతూ నీటిని పడుతున్న సిబ్బంది
- సమస్యను పరిష్కరించాలని వినతి

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రంలోని చెన్నకేశవుని ఆలయం సమస్యల నిలయంగా మారింది. వర్షం పడితే ఆలయం పైకప్పు మొత్తం నెమ్ము విడుస్తోంది. పై కప్పు నుంచి వర్షం చుక్కలు జాలువారుతున్నాయి. ఆ నీరు పడేచోట బకెట్లు పెడుతున్నారు. దీంతో పల్నాటి వీరుల ఇలవేల్పు, లక్షలాది భక్తుల ఆరాధ్యదైవం చెన్నకేశవుడు చిన్నబోతున్నాడు. ఈ దుస్థితిని చూసి భక్తులు కలత చెందుతున్నారు. స్వామివారి ఆలయానికి నిధుల కొరత లేదు. కానీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. దేవాలయానికి ఏడాదికి రూ. 27.03 లక్షల దాకా ఆదాయం వస్తోంది. తక్షణం మరమ్మతులు ఆవశ్యంగా కన్పిస్తోంది. ఇప్పటికే శ్లాబు లోపలి ఇనుము మొత్తం తుప్పుపట్టి ఉండవచ్చు. శ్లాబు మరింత బలహీనపడితే చాలా ఇబ్బంది. పైగా అది భారీ పైకప్పు. 2005లో ఆలయాన్ని పునర్నిర్మించారు. అప్పటినుంచి మరమ్మతులు చేయించలేదు. దేవాలయ రంగులు కూడా వెలసిపోయాయి. ప్రతి ఏటా కార్తిక అమావాస్య నుంచి 5 రోజుల పాటు జరిగే చారిత్రక ప్రసిద్ధి పల్నాటి వీరారాధన ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. వీరితో పాటు ప్రతిరోజూ వచ్చే భక్తులకు దీనివల్ల అసౌకర్యం కలుగుతుంది. అక్కడక్కడ ఫ్లోరింగ్ పగిలిపోయింది. కొన్ని చోట్ల కుంగిపోయింది. చివరకు స్వామివారి గ్రామోత్సవం అయిపోయాక ఉత్సవ మూర్తులను గుడిలో పెట్టడానికి గత దసరా పండుగనాడు సేవకులు లేని పరిస్థితి వెలుగు చూచింది.



చెన్నకేశవస్వామి దేవాలయం



పైకప్పు నుంచి కారుతున్న నీటిని పట్టేందుకు పెట్టిన బకెట్లు

ఆదాయం మిన్న.. సౌకర్యాలు సున్నా..

చెన్నకేశవ కాంప్లెక్స్ ద్వారా ఏడాదికి రూ.25,20,000 ఆదాయం వస్తోంది. పూజారి కింద 65 ఎకరాలు, దేవదాయ శాఖ కింద 18.95 ఎకరాలు, సేవకుల కింద 24 ఎకరాలు, విలువైన మరో 27.5 ఎకరాలు ప్రభుత్వం పేదల ఇంటి స్థలాలకు చాలా కాలం క్రితం ఇచ్చారు. వాస్తవానికి సగం ఊరు స్వామివారి భూముల్లోనే ఉంది. పైగా ఇది 6బి ఆలయం. గ్రేడ్ వన్ ఈఓ, ఏడుగురు సిబ్బంది ఉన్నారు. కానీ దానికి తగినట్లుగా ఆలయ అభివృద్ధి మాత్రం జరగడం లేదు.

సమస్యను పరిష్కరించండి..



ఆలయ పైకప్పు కారడం వల్ల చాలా ఇబ్బందిగా ఉంటోంది. పూజా కార్యక్రమాలకు వచ్చే భక్తులకు అసౌకర్యంగా ఉంది. పై కప్పు పైన వర్షం నీరు నిలబడుతోంది. దీంతో ఆ నీళ్లు శ్లాబులోంచి కిందకు ఇంకుతున్నాయి. వర్షం నీరు పడే చోట్ల బకెట్లు పెడుతున్నాం. లేకుంటే ఫ్లోరింగ్ తడిసి కాళ్లు జారుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాను.

– కె.సత్యనారాయణాచార్యులు, చెన్నకేశవస్వామి ఆలయ పూజారి

త్వరలోనే సమస్యకు పరిష్కారం..

ఈ సమస్యను దేవదాయశాఖ ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వారు గతంలో వచ్చి పరిశీలించారు. మరమ్మతులకు అంచానా ప్రతిపాదనలు తయారు చేస్తామని చెప్పారు. అంచనా ప్రతిపాదనలు పూర్తయి పై అధికారుల ఆమోదం తెలిపి ఆదేశాలు రాగానే పనులు జరుగుతాయి. నిధులు కొరత కూడా లేదు. ఆలయం నిధులు రూ.6 లక్షలు అందుకోసం రిజర్వ్ చేయడం జరిగింది. నేను ఇక్కడ నుంచి బదిలీ అయ్యాను. వచ్చే అధికారులు పనులు చేయిస్తారు.

– పి కృష్ణంరాజు, ఈఓ, చెన్నకేశవస్వామి దేవాలయం, కారెంపూడి

సౌరవిద్యుత్‌ను సద్వినియోగం చేసుకోండి

విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబొట్లు



మాచర్ల: డివిజినల్ పరిధిలో ప్రతి విద్యుత్ వినియోగదారుడు ప్రయోజనం పొందేలా పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద సౌర విద్యుత్ పథకం ప్రారంభించనున్నామని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల డివిజినల్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబొట్లు కోరారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఈ పథకం గురించి పూర్తి వివరాలను వెల్లడించారు. గృహాలకు తగిన రూఫ్, స్థలం ఉంటే సోలార్ ప్లాంట్‌ను కేటాయించటం జరుగుతుందన్నారు. ప్రతి వినియోగదారుడికి 0.150 నుంచి 1కేవీ వరకు సోలార్ రూఫ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే రూ.30వేల నుంచి రూ. 60వేల వరకు సబ్సిడీ ఇవ్వటం జరుగుతుందన్నారు. అదేవిధంగా 150 నుంచి 1కెవి రూ. 60వేల నుంచి 78వేల వరకు సబ్సిడీ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఆ పైన సైతం రూ. 78వేలు సబ్సిడీ ఇవ్వటం జరుగుతుందన్నారు. పిఎంసూర్యఘర్.జిఓవి.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు చేప పిల్లలు విడుదల

విజయపురిసౌత్: మాచర్ల మండలం అనుపు కృష్ణా జలాశయంలో సుమారు 12 లక్షల చేప పిల్లలను ఆదివారం మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి చేతుల మీదుగా విడుదల చేయనున్నారు. కూటమి ప్రభుత్వంలో మొదటిసారిగా సాగర్ కృష్ణా జలాశయంలో చేప పిల్లలను విడుదల చేయనున్నారు. చేప పిల్లల విడుదల నేపథ్యంలో ఫిషరీస్ అధికారులు అనుపులో అన్ని ఏర్పాట్లు చేశారు.

గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

రూ. 6.22లక్షలు అపరాధ రుసుము విధింపు

మాచర్ల: పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్స్ విభాగాల వారి ఆధ్వర్యంలో జిల్లా పర్యవేక్షణ ఇంజనీర్ డాక్టర్ పి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మాచర్ల రూరల్‌లోని పలు గ్రామాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, సిహెచ్ రాంబొట్లు తెలిపారు. శనివారం తనిఖీల అనంతరం వారు విద్యుత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మొత్తం 49 మంది అధికారులు 147 మంది సిబ్బంది 49 బృందాలుగా ఏర్పడి రూరల్ ప్రాంతంలో 4602 సర్వీసులు మీటర్‌లను తనిఖీ చేసి రూ.6.20లక్షల అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. మీటర్ లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నవారికి రూ. 4వేలు, మీటరున్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఆరుగురికి రూ. 2.20లక్షలు అనుమతికి మించి ఇతర కేటగిరిలో వాడుతున్న ఇద్దరికి రూ. 20వేలు, అనుమతిచ్చిన లోడు కన్నా అదనంగా విద్యుత్ వాడుతున్న 60 మందికి రూ. 3.77లక్షలు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. ప్రజలు విద్యుత్ మీటర్ సీలును గమనిస్తుండాలన్నారు. సీలు లేకపోయినా, తుప్పు పట్టినా, ఊడిపోయిన మీటర్లకు వెంటనే సిబ్బందికి రాత పూర్వకంగా తెలపాలన్నారు. పూర్తి వివరాలకు 9440812263, 9440812360 నెంబర్లను నేరుగా వాట్సాప్ ద్వారా సంప్రదించవచ్చునన్నారు. రూరల్ మండలంలో రాయవరం, కొత్తూరు, చింతలతండ, హసనాబాద్, గన్నవరం, సుబ్బారెడ్డిపాలెం, తాళ్ళపల్లి ఏరియాలో ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో డీఈఈ కె.రవికుమార్, ఎ.రామయ్య, ఏఈ కె.కోటేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- పదో అదనపు జిల్లా జడ్జి జి.ప్రియదర్శిని
- సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు

గురజాల: విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాలని పదో అదనపు జిల్లా జడ్జి జి.ప్రియదర్శిని సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం, సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాలను శనివారం రాత్రి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని గదులను పరిశీలించి విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి మెనూ ప్రకారం భోజనం విద్యార్థులకు అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహాలు శుభ్రంగా ఉన్నాయని విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఏఎస్‌డబ్ల్యూఓ సుజాత కుమారి, వసతి గృహం వార్డెన్‌లు ఉన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని బి.గంగోత్రికి ఫీజుల నిమిత్తం ఆర్యవైశ్య నాయకులు ఆర్థికసాయం సాయం చేశారు. విద్యార్థిని ఆర్థిక పరిస్థితిపై స్థానిక ఆర్యవైశ్య నాయకులు పల్నాడు జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు దృష్టికి తీసుకొని రావటంతో స్పందించిన సుబ్బారావు కాలేజీ ఫీజు, బస్సు ఫీజు కలిపి మొత్తం రూ. 32 వేలు ఆర్థిక సహాయం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గడిచిన ఐదేళ్లలో తన మిత్రుల ద్వారా విద్యార్థుల కోసం సుమారు రూ. 2 ఆర్థిక సహాయం అందించటం జరిగిందని తెలిపారు. పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ఆర్థికసాయం చేసిన అత్తులూరి సుబ్బారావు

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

మాచర్ల: ఆన్‌లైన్‌లో మేసేజ్‌లు పెట్టి ఓటీపీ చెప్పండి మీకు నగదు వస్తుందంటూ చేసే తప్పుడు ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ బాస్‌దేవ్, ఫీల్డ్ ఆఫీసర్ కుమార్ దినేష్‌లు అన్నారు. శనివారం పురపాలక సంఘ కార్యాలయ ప్రాంగణంలో మెప్మా ప్రాజెక్టు ఆఫీసులో డ్వాక్రా మహిళలు, ఆర్పీలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకు ఖాతా నెంబర్‌ను ఎవరడిగినా చెప్పకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆధార్ కార్డు నెంబర్, పాన్ కార్డు నెంబర్, ఏటీఎం నెంబర్లతో పాటు ఓటీపీ అడిగితే స్పందించకుండా ఉండాలన్నారు. ఈ విషయమై దేశవ్యాప్తంగా యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని, ఏదైనా ఇటువంటి సమస్య వస్తే వెంటనే బ్యాంకును సంప్రదించాలన్నారు.



డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

ముప్పాళ్ళ: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా రైతులు ఫిర్యాదు చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ హెచ్చరించారు. మండలంలోని ముప్పాళ్ళ, దమ్మాలపాడు గ్రామాల్లోని ఎరువుల గోదాముల్లోని నిల్వలను శనివారం ఆమె పరిశీలించారు. మండలంలో సాగుకు సరిపడా ఎరువులు ఉన్నాయని, ప్రస్తుతం యూరియా 91 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 210 టన్నులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. వచ్చే వారంలో మొక్కజొన్న సాగు ఆరంభమవుతుందని, అందుకు అవసరమైన నిల్వలను సిద్ధం చేస్తున్నామన్నారు. సొసైటీల్లోను నిల్వ ఉంచేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏఓ అరుణ

ఆర్టీసీ డీఎం పిచ్చయ్యకు సత్కారం

మాచర్ల: మాచర్ల డిపో ఆర్టీసీ డీఎంగా పని చేసి మంగళగిరికి బదిలీపై వెళ్తున్న ఆర్.పిచ్చయ్యకు పలువురు ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికి ఆయనను సత్కరించారు. మూడు సంవత్సరాలుగా డీఎంగా పనిచేసి సంస్థను జిల్లాలో మొదటి స్థానంలో నిలిపిన పిచ్చయ్య సేవలు ఎనలేనివని పలువురు పేర్కొన్నారు. అనంతరం పిచ్చయ్యను ఘనంగా సత్కరించారు. సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

దాచేపల్లి: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయాలపాలైన సంఘటన శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నడికుడి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు అద్దంకి–నార్కెట్‌పల్లి హైవేపై ఢీకొన్నాయి.

ఈ ఘటనలో రామాపురంకి చెందిన పిల్లి నవీన్, అద్దంకి చెందిన పసుపులేటి అభినవ్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108వాహనం ద్వారా గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అదేవిధంగా నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలో పాలట్యాంకర్ ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తులను ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ రెండు రోడ్డు ప్రమాదాలపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ప్రసవాల సంఖ్య పెరగాలి

డీఎంహెచ్‌ఓ రవి



పెదకూరపాడు: ప్రభుత్వ వైద్యశాలల్లో సాధారణ ప్రసవాలు పెరిగేలా చూడడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి అన్నారు. శనివారం పెద్దకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రసూతి వార్డులో పర్యటించి గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, వార్డులను పరిశీలించారు. రూ.8.5 కోట్లతో నిర్మించిన నూతన వైద్యశాలలోకి వైద్య సేవలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట వైద్యులు రమేష్, సిబ్బంది ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే పల్లె పండుగ ధ్యేయం

గురజాల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రూ. 4,500 కోట్లతో పల్లెపండుగ వారోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రెంటచింతల, పాలువాయి గేటు గ్రామాలలో పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా రూ. 60 లక్షల విలువైన పనులకు ఆయన భూమి పూజా కార్యక్రమాలను నిర్వహించి మాట్లాడారు. ఎంపీడీఓ కె.సరోజినిదేవి, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ



రెంటచింతలలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

కారెంపూడి: మండలంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు. శనివారం నాడు కారెంపూడి, పేటసన్నెగండ్ల, చింతపల్లి గ్రామాలలో ఎంజీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దైవ సేవకుల సహవాస కూడిక

మాచర్ల: ప్రతి సేవకుడు సైనికుడిగా పనిచేసి దేవుని వాక్య పరిచర్యను సంపూర్ణంగా క్రైస్తవుల వద్దకు చేర్చాలని హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రకాష్ అన్నారు. శనివారం పల్నాడు దైవ సేవకుల సహవాస కూడిక సమావేశం శ్రీశైలం రోడ్డులో లయల్ ఇవాంజిలికల్ ఫెలోషిప్‌లో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన పాస్టర్ ప్రకాష్ మాట్లాడుతూ దేవుని నామాన్ని, క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరి దగ్గరకు చేర్చే బాధ్యతను పాస్టర్లు తీసుకోవాలన్నారు. ఆయన ప్రేమ సామ్రాజ్యాన్ని అనేకులకు పరిచయం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి పాస్టర్ ఎలీషా అధ్యక్షత వహించగా దైవ సేవకుల నియోజక వర్గ అధ్యక్షుడు జాన్ వెస్లి, కార్యదర్శి మోహన్‌బాబులు వాక్య పరిచర్య చేశారు. ఈ కార్యక్రమంలో సహవాస పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.



సహవాస కూడికలో పాల్గొన్న వివిధ చర్చిల పాస్టర్లు, అతిథులు

రీసర్వే గ్రామ సభలో 86 ఫిర్యాదులు

దాచేపల్లి: మండలంలోని ముత్యాలంపాడు గ్రామ సచివాలయంలో రీసర్వే గ్రామసభ శనివారం నిర్వహించారు. గురజాల ఆర్డీఓ వి.మురళీకృష్ణ ఈ సభలో పాల్గొని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. భూ సమస్యలపై రైతుల నుంచి 86 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ చెప్పారు. ఈ సభలో తహసీల్దార్ వైవీ కుటుంబరావు, డిప్యూటీ తహసీల్దార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గురజాల రూరల్: గ్రామ సభలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.నగేష్ సూచించారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేకు సంబంధించి మొత్తం 31 అర్జీలు వచ్చినట్లు వాటిలో విస్తీర్ణంలో తేడా గురించి 12, మ్యూటేషన్‌కు సంబంధించి 15, ఎల్‌పీఎం నెంబర్లకు సంబంధించి 4 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సమస్యలు ఉంటే వెంటనే మా దృష్టికి తీసుకురావాలన్నారు. టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీకృష్ణ, పక్కన తహసీల్దార్ కుటుంబరావు

నేడు కారెంపూడిలో ఎమ్మెల్యే పర్యటన

కారెంపూడి: మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం కారెంపూడి మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి శనివారం సాయంత్రం తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఆరోగ్యశ్రీ పథకం కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేస్తారని తెలిపారు. అలాగే వేపకంపల్లి, పెదకొదమగుండ్ల, గాదెవారిపల్లె గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ పేర్కొన్నారు.

ఘనంగా అట్ల తద్ది

పెదకూరపాడు: మండలంలో అట్ల తద్ది వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వివాహమైన వారికి పుట్టింట్లో తెల్లవారు జామునే పవిత్ర స్నానాలు చేసి.. మేనమామ పోతురాజుగా, ఐదుగురు పుణ్య స్త్రీలు ముత్తైదువులుగా ఉండి తలా ఒక ముద్ద ఇచ్చి, సూర్యోదయానికి ముందే తిని, పగలు ఉపవాసం ఉన్నా రు. వ్రతంలో ఉన్నవారు పగలు ఊయల ఊగారు. చంద్రోదయం అయ్యాక ఉపవాసం ముగించారు. ముద్దపప్పు మూడట్లు, అట్లతద్ది ఆరట్లు, ఇచ్చుకుంటినమ్మ వాయనం, పుచ్చుకుంటి నమ్మ వాయనం అంటూ ముత్తైదువులకు అట్లు, అరిసెలు వాయనమిచ్చా రు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. గ్రామాల్లో రావి, తాడి చెట్లుకు పెద్ద ఎత్తున ఊయలలు వేశారు. 75త్యాల్లూరులో గ్రామీణ ప్రాంత సాంప్రదాయాలను గౌరవించి కొనసాగించడం హర్షణీయం.



వాయినాలు ఇచ్చుకుంటున్న ముత్తయిదులు